మలక్‌పేటలో ఓటు వేసిన త్రిపుర గవర్నర్

చాదర్‌ఘాట్, మే 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో పలువురు ప్రముఖులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పోలింగ్ ప్రారంభం కాగానే సలీంనగర్ కమ్యూనిటీహాల్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 204లో తన సతీమణితో కలిసి వచ్చి ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కువేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తిరుమలహిల్స్‌కాలనీ సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నంబర్ 90లో కుటుంబీకులతో కలిసి ఓటు వేశారు. మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ తన కుటుంబీకులతో కలిసి ఆజంపురలోని కిడ్జీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నంబరు 128లో ఓటు వేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ సెయింట్ డామినిక్స్ హైస్కూల్‌లో, మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఆరోరా కళాశాలలో, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంజరి వినోద్‌కుమార్ అక్బర్‌బాగ్‌లో ఓటు వేశారు.

సీనియర్ సిటిజన్లను కారులో పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చిన ఓటరు

- కారు తీసుకురావడంపై పోలీసుల అభ్యంతరం
- ఓటరు, పోలీసుల మధ్య వాగ్వాదం.. పోలీస్ సిబ్బందిపై ఫిర్యాదు

దిల్‌సుఖ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న సీనియర్ సిటిజన్స్‌ను కారులో పోలింగ్ బూత్ వద్దకు తీసుకువచ్చిన తమపై దురుసుగా ప్రవర్తించి, కారు తాళాలు లాక్కున్న పోలీస్ సిబ్బందిపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఓ ఓటరు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్స్ కాలనీ రోడ్డు నెం.1లో నివసించే రామకృష్ణచౌదరి(42) తన భార్య, అత్తమామలతో కలిసి ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ హోం పోలింగ్ బూత్‌కు కారులో వచ్చారు. అయితే రామకృష్ణ అత్త పి.ఝాన్సీ లక్ష్మీ(79), మామ పి.వెంకటరత్నం(83)లు నడవలేని స్థితిలో ఉండడంతో, పోలింగ్ బూత్ గేటు వద్ద అనుమతి తీసుకుని కారును లోపలికి తీసుకుని వెళ్లాడు. కారు డ్రైవింగ్ సీటులో నుంచి కిందకు దిగిన రామకృష్ణ వెనుక సీటులో ఉన్న అత్త ఝాన్సీలక్ష్మీను కర్ర సహాయంతో కారులో నుంచి కిందకు దింపుతున్నాడు. ఆ సమయంలో అక్కడ బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న ఎస్.ఐ లక్ష్మయ్య అతని సిబ్బంది వచ్చి కారు లోపలకు ఎందుకు తీసుకువచ్చావని ప్రశ్నించారు. అయితే సీనియర్ సిటిజన్‌లు నడవలేకపోవడం మూలంగా గేటు వద్ద ఉన్న వారి అనుమతితో లోపలకు కారు తీసుకువచ్చానని వివరించాడు. ఈ క్రమంలో పోలీసులకు, రామకృష్ణకు మధ్య వాగ్వాదం చెలరేగింది. దీంతో కారును బయటకు తీయాలని ఎస్ఐ కానిస్టేబుల్‌ను ఆదేశించడంతో రామకృష్ణ కారు తాళాలు లాక్కున్నారు. దీంతో రామకృష్ణ ఈ వివాదాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా, పోలీసులు బలవంతంగా ఫోన్ లాక్కోవడంతో, అది కిందపడిపోయింది. వెంటనే రామకృష్ణ ఫోన్ తీసుకుని పోలీస్ కంట్రోల్ రూమ్ 100కు డయల్ చేశాడు. బ్లూ కోల్ట్ సిబ్బంది వచ్చి విచారిస్తుండగానే ఎస్ఐ, కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించి, బెదిరించారంటూ రామకృష్ణచౌదరి సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలలో బీపీడీఏవీ విద్యార్థుల జయకేతనం

చంపాపేట, మే (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాలలో సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలలో విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి జయకేతం ఎగరవేశారు. సోమవారం వెలుబడిన ఫలితాలలో పాఠశాలలోని 148మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాల ఆవరేజ్ 81శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. విద్యార్థులలో శ్రద్ధ కా మీనన్ 494మార్కులు(98.8 శాతం), ఎంఎస్ఎన్ఎస్‌వీ సాహిష్ణు(98.2శాతం), ఆరుష్ మిట్టల్(97.2శాతం), టీవీకే లాస్య(97.2శాతం), వెంకటచరణ్‌కుమార్‌రెడ్డి(97.0శాతం)ఉత్తీర్ణత సాధించి స్కూల్ టాపర్స్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు.



మార్మిక నది కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

'మార్మిక నది' ప్రజాచైతన్య కవితా ప్రవాహం

- ఆచార్య కొలకలూరి ఇనాక్

రాంనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది కావ్యం ఒక ప్రజాచైతన్య ప్రవాహమని, దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావాలని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. విశాల సాహితీ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో చిక్కడపల్లి కళాభారతిలో సోమవారం ప్రముఖ కవి డాక్టర్. బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది కావ్యంపై సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బిక్కి కృష్ణ కవిత్వం, పరిశోధనలు, సాహిత్య సేవలు అనితర సాధ్యమని కొనియాడారు. కవి గోరటి వెంకన్న మాట్లాడుతూ.. ఏ కొలమానాలకు అందని స్వచ్ఛమైన కవి, పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని నిఖార్సయిన విమర్శనాగ్రంథాలు వెలువరించిన మంచి విమర్శకుడు బిక్కి కృష్ణ అని ప్రశంసించారు. ప్రసిద్ధ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. మార్మిక నది వస్తు శిల్పశోభితమైన గొప్ప కావ్యమన్నారు. ప్రముఖ కవి విద్యాధర్ మాట్లాడుతూ శైవ కవుల, బసవేశ్వరుని సంఘ సంస్కరణ బిక్కి కృష్ణను ప్రభావితం చేశారన్నారు. రచయిత్రి రోహిణి వంజారి మార్మిక నది పుస్తకాన్ని సమీక్షించారు.

బీటెక్ చదివాడు.. బెట్టింగుకు బానిసయ్యాడు..

- గొలుసు కాజేసిన యువకుడి అరెస్ట్

పంజాగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదివాడు.. ఉద్యోగం కోసం నగరానికి వచ్చాడు. ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. అప్పుల పెరిగి డబ్బుల కోసం ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు దోచుకెళ్లిన నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం దొప్పలపూడి గ్రామానికి చెందిన కొండేటి నాగపృథ్వీ (23) బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగం నిమిత్తం గత ఏడాది నగరానికి వచ్చాడు. ఎల్లారెడ్డిగూడలోని ఓ బాయిస్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసై అప్పుల పాలయ్యాడు. డబ్బుల కోసం చోరీ చేయాలని భావించి ఈ నెల 12న ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలోని నివాసం ఉంటున్న విజయలక్ష్మీ(75) ఇంట్లోకి దూరాడు. వంట గదిలో వంట చేస్తున్న ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నాగపృథ్వీ హాస్టల్‌కు వెళ్లి అతని వివరాలు సేకరించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దోపిడీ చేసిన బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు.

బైక్ పెట్రోల్‌ట్యాంక్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మొహమ్మద్ నదీమ్ (ఫైల్)

చార్మినార్ మే 13 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ బైక్‌కు మంటలు అంటుకుని పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మొఘల్‌పురా సుల్తాన్ షాహీకి చెందిన మహమ్మద్ నయీమ్ కుమారుడు మహమ్మద్ నదీమ్(32) చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భవానినగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం మొఘల్‌పురాలోని నాజర్ పంక్షన్‌హాల్ వద్ద బుల్లెట్ బైక్‌కు మంటలంటుకోగా స్థానికులు నీటిని చల్లుతూ తడిచిన గోనె సంచులు వేసి ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బుల్లెట్ పెట్రోల్ ట్యాంక్ పేలి పదిమంది గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతున్న వారిలో నదీమ్ మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నదీమ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ఓటు వేసిన మేయర్ పారిజాతానర్సింహారెడ్డి దంపతులు



ఆర్‌కేపురంలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేఖ దంపతులు



ఓటు వేసిన అందెల శ్రీరాములుయాదవ్ దంపతులు



సరూర్‌నగర్‌లో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్ దంపతులు



మీర్‌పేట్‌లో ఓటు వేసిన మేయర్ దుర్గాదీప్‌లాల్



మన్సూరాబాద్‌లో కార్పొరేటర్ కొప్పుల



అల్మాస్‌గూడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



మీర్‌పేట్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తోడికోడళ్లు



మీర్‌పేట్‌లోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్తున్న ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఉదయం సందడిగా.. మధ్యాహ్నం మందకొడిగా
- సాయంత్రానికి మళ్లీ పుంజుకున్న ఓటింగ్
- ఓటర్లకు డబ్బు పంపిణీపై పార్టీల పరస్పర ఆరోపణలు

సరూర్‌నగర్/ఎల్‌బీనగర్, మే 13(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లతో పాటు సరూర్‌నగర్ మండలంలోని సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల పరిధిలో సోమవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించగా కాలనీల్లో కన్నా పాత గ్రామాల్లోని ఓటర్లు పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నట్టు కనిపించింది. ఉదయం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి కనిపించారు. ఎండలు మండుతుండడంతో చాలా మంది ఉదయాన్నే వచ్చి క్యూలో నిల్చుని ఓటు వేశారు. మధ్యాహ్నం 12.30గంటల దాకా ఓటర్ల సందడి ఎక్కువగా కనిపించగా, ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటల వరకు జనం పలుచగా కనిపించారు. పలు బూత్‌లలో ఐదారుగురు ఓటర్లు మాత్రమే కనిపించగా, కొన్ని బూత్‌లలో అసలు ఓటర్లే లేకుండా ఖాళీగా కనిపించాయి. కాగా సాయంత్రం 4.30 గంటల తర్వాత తిరిగి ఓటర్ల సందడి మొదలైంది. ఒకరొకరుగా వస్తూ చివరకు లైన్లలో పదుల సంఖ్యలో చేరారు. సాయంత్రం 6గంటల దాకా సమయం ఉండడంతో మధ్యాహ్నం చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం వాతావరణం చల్లబడిన తర్వాత మెల్లమెల్లగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు, ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

డబ్బు పంపిణీపై కాంగ్రెస్, బీజేపీ ఘర్షణ

మీర్‌పేట్‌లోని పలు కేంద్రాల వద్ద ఓటర్లకు కాంగ్రెస్ నేతలు డబ్బు పంచుతున్నారంటూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు అందెల శ్రీరాములుయాదవ్ అక్కడకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే తాము ఓటర్లకు పోలింగ్ చీటీలు మాత్రమే ఇస్తున్నామని, బీజేపీ నేతలు తమపై అభాండాలు వేస్తూ గొడవకు దిగారని, పలు డివిజన్లలో బీజేపీ నేతలే డబ్బు పంచారని కాంగ్రెస్ నేతలు ప్రత్యారోపణ చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనగా మీర్‌పేట్ పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని చక్కదిద్దారు.



మీర్‌పేట్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన అనంతరం స్థానిక నాయకులతో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

ఓటేసిన ప్రజాప్రతినిధులు, నేతలు

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ మేయర్లు చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, దుర్గాదీప్‌లాల్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు, కార్పొరేటర్లు రాధధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణిఅంజన్ దంపతులు, డిప్యూటీ మేయర్లు ఇబ్రాం శేఖర్, తీగల విక్రమ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, రెండు కార్పొరేషన్లకు చెందిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇతర ముఖ్య నేతలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రం నుంచి ఈవీఎంలతో వెళ్తున్న అధికారులు



బీఎన్‌రెడ్డినగర్‌లో ఓటు వేసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి దంపతులు



కుటుంబంతో వనస్థలిపురం హుడా సాయినగర్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి



నాగోల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్

ఎల్‌బీనగర్‌లో 46.26 శాతం పోలింగ్

ఎల్‌బీనగర్, మే 13(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి మందకొడిగా సాగింది. తర్వాత కొంత హడావిడి కనిపించినా మధ్యాహ్నం మళ్లీ పోలింగ్ కేంద్రాలు వెలవెలపోయాయి. పోలింగ్ ముగిసే సమయానికి కొందరు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. చివరకు పోలింగ్ శాతం గణనీయంగా తగ్గి 46.26గా నమోదైంది.

మలక్‌పేటలో 42.08 శాతం పోలింగ్

చాదర్‌ఘాట్, మే 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 42.08 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పో లింగ్ సాయంత్రం 6గంటల వరకు సాగింది. మలక్‌పేటలో 3,15,631 మంది ఓటర్ల కోసం 300 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం నుంచి మంద కొడిగా సాగింది. పోలింగ్ ప్రారంభమైన తర్వాత ఉదయం 9గంటల వరకు 4.57శాతం పోలింగ్ నమోదు కాగా, ఉదయం 11గంటల వరకు 11.98 శాతం పోలింగ్ నమోదైనట్లు మలక్‌పేట ఏఆర్‌వో రాజేష్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 17.74 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 3గంటల వరకు 27.38శాతం పోలింగ్ కాగా, సాయంత్రం 5గంటలకు 37.84 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే నాటికి 42.08 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

మందకొడిగా ప్రారంభం..

ఎల్‌బీనగర్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 6,04,763 మంది ఓటర్లు ఉండగా దాదాపు 2,80,000 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 46.26శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. ఉదయం 9గంటల వరకు కేవలం 5.9శాతం పోలింగ్ నమోదవగా, 11గంటల వరకు 12.36 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 26.74 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల వరకు 34.82 శాతంగా ఉన్నప్పటికీ చివరి క్షణంలో ఓటర్లు రావడంతో మొత్తం పోలింగ్ 46.26 శాతానికి చేరుకుంది.

వనస్థలిపురం, నాగోల్ ప్రాంతాల్లో..

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కొత్తపేట డివిజన్‌లో..

కొత్తపేట: కొత్తపేట -21 డివిజన్ పరిధిలోని 49 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి 9.30 వరకు ఓటింగ్ కాస్త మందకొడిగా జరిగింది. కొత్తపేట ఎంపీపీ స్కూల్‌లో ఎంఎల్‌సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా ఓటు వేశారు. సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సతీమణి వైష్ణవితో కలిసి కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పలు కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో టీపీసీసీ క్యాంపెయిన్ చైర్మన్ మధుయాష్కిగౌడ్, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్యలో పోలింగ్ మందకొడిగా సాగింది. రెండు గంటల్లో కేవలం 150ఓట్లు మాత్రమే పోలైనాయి. ఆ తర్వాత ఓటర్ల సంఖ్య పెరిగింది.

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా కొనసాగి సాయంత్రం 6గంటలకు ముగిసింది. టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చంపాపేటలోని పీఎస్ పోలింగ్ కేంద్రంలో, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కర్మన్‌ఘాట్‌లోని పీఎస్ పోలింగ్ కేంద్రంలో, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సాయిరాంనగర్‌కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగుల కోసం వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు, నేతలు

ఎల్‌బీనగర్ సెగ్మెంట్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజినిరెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, పవన్‌కుమార్, లచ్చిరెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నర్సింహగుప్తా సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించి వారి ఏజెంట్లతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు.



హయత్‌నగర్‌లో ఓటు హక్కును ఉపయోగించుకున్న టీపీసీసీ క్యాంపెయిన్ చైర్మన్ మధుయాష్కిగౌడ్



హయత్‌నగర్‌లో ఓటు హక్కును ఉపయోగించుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



హయత్‌నగర్‌లో ఓటు హక్కును ఉపయోగించుకున్న 99 సంవత్సరాల వృద్ధురాలు నాగమణి



సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సతీమణి వైష్ణవితో కలిసి ఓటు వేసిన కార్పొరేటర్ పవన్‌కుమార్



కర్మన్‌ఘాట్‌లోని పీఎస్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి



ఓటు వేసిన మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి దంపతులు



చంపాపేటలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి కుటుంబసభ్యులు



సైదాబాద్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, బీజేపీ నేత హరిగౌడ్





బీఎన్‌రెడ్డినగర్‌లో 90ఏళ్ల వృద్ధులు

భువనగిరి నియోజకవర్గం పరిధిలో..

హయత్‌నగర్: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అధికారులు ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగిసింది. ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్యలో సుమారు 100నుంచి 150 ఓట్లు మాత్రమే పోలైనాయి. తొమ్మిది తర్వాత పోలింగ్ శాతం పెరిగింది. తుర్కయంజాల్, రాగన్నగూడ, కమ్మగూడ, బ్రాహ్మణపల్లి, కోహెడా, మునగనూర్, ఉమర్‌ఖాన్ గూడ, ఇంజాపూర్ గ్రామాల్లో పోలింగ్ సజావుగా జరిగింది. తొర్రూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఇంజాపూర్‌లో వైస్ చైర్‌పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్, తుర్కయంజాల్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఓటు మక్కును ఉపయోగించుకున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పోలింగ్ ప్రశాంతం గా జరిగింది. ఉదయం నుంచే పోలింగ్ స్టేషన్లకు ఓటర్లు బారులు తీరారు. మండలంలో ఉదయం 9గంటల వరకు 7.7శాతం, 11గంటలకు 19.39 శాతం, 1 గంటలకు 34.16 శాతం, 3గంటలకు 46.19 శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడ కూడా ఎలాంటి ఘర్షనలు చోటుచేసుకోలేదు.

పసుమాములలో ఓటు వేసిన అభ్యర్థి నర్సయ్యగౌడ్

భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్. బూర నర్సయ్యగౌడ్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల 289/ఏ పోలింగ్ స్టేషన్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ లష్కర్‌గూడలోని పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పోలింగ్ స్టేషన్‌ను రాచకొండ సీపీ తరుణ్‌జోషీ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డితో కలిసి సందర్శించారు. లష్కర్‌గూడలో జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, కుంట్లూర్‌లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



తొర్రూర్‌లో బారులు తీరిన ఓటర్లు



ఇంజాపూర్‌లో ఓటు హక్కును ఉపయోగించుకున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరితా ధన్‌రాజ్‌గౌడ్



తారామతిపేటలో ఓటు వేసిన 105 ఏళ్ల వృద్ధుడు కటిక నరసింహ



సరూర్‌నగర్‌లో ఓటు వేసి వస్తున్న వృద్ధుడు



పసుమాములలో పోలింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఓటర్లు